సిఎం సారూ.. పర్మినెంట్ చేయండి..

- మూడేండ్లు, నాలుగేండ్లు పాయే.. కొలువు గ్యారంటీ లేకపాయే
- ఆందోళనలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- రెండు నెలల వేతనాలు పెండింగ్‌లోనే
- 28 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు సమాయత్తం!


నల్లగొండ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైలు)

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం సారూ చేతులెత్తి వేడుకుంటున్నాం..దయచేసి పర్మినెంట్ చేయించండి' అంటూ రాష్ట్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వేడుకుంటున్నారు. ఏ ప్రభుత్వ శాఖలో ఉద్యోగమొచ్చినా ప్రొబెషనరీ కాలం మాత్రం రెండేండ్లే. జెపిఎస్‌లకు మాత్రం ఎక్కడా లేని నిబంధన తీసుకొచ్చి పెట్టి మూడేండ్లు అని రాష్ట్ర సర్కారు కొర్రీ పెట్టింది. ఏడాదే ఎక్కువగా కదా..సర్కారు కొలువు ఎందుకు వదిలేయానే ఉద్దేశంతో గమ్మునగా పనిచేశారు. టైంకాగానే పర్మినెంట్ ప్రస్తావన ఎత్తితే..'కాదు..కాదు..ఇంకా ఏడాది పెంచుతున్నాం' అని మెలిక పెట్టి కూర్చున్నది. కుంటలో పడ్డాక బురద అంటకుండా పోతుందా భరిద్దాంలే అని జెపిఎస్‌లు చచ్చినట్టు కొలువుచేశారు. మంగళవారంతో నాలుగేండ్లు పూర్తవుతుంది. నేటికీ పర్మినెంట్ ప్రస్తావనే లేదు. 'ఇంకెన్నాళ్లు ఈ ఎదురుచూపులు..బానిస బతుకులు' అని జెపిఎస్‌లు ఆందోళన బాట పట్టేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నెల 28 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు కూడా సమాయత్తం అవుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం 2019లో రిక్రూట్‌మెంట్ టెస్టు ద్వారా 9,355 పంచాయతీరాజ్ జూనియర్ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేసింది. మూడేండ్ల ఒప్పందం మీద 2019 ఏప్రిల్ 12 నుంచి జెపిఎస్‌లు విధులు చేపట్టారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ, పల్లె ప్రగతి, హరితహారం, తదితర కార్యక్రమాల నిర్వహణతో పాటు 55 దాకా రిజిస్టర్లను వారే చూసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో కొండంత పనిని మీదేసుకుని పనిచేస్తున్నారు. అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు ప్రొబేషనరీ కాలం రెండేండ్లు మాత్రమే. వీరికి మాత్రం రాష్ట్ర సర్కారు మూడేండ్లు అని నిర్ణయించింది. ఈవిషయంలో పెద్దఎత్తున విమర్శలొచ్చినా రాష్ట్ర సర్కారు వెనక్కి తగ్గలేదు. దాన్ని రెండేండ్లకు కుదించి తమకూ పిఆర్‌సి వర్తింపజేయాలని అధికారుల వద్ద జెపిఎస్‌లు ప్రాధేయపడ్డా కనికరించలేదు. ఈ గొడవ ఇలా ఉండగానే పుండుమీద కారం చల్లినట్టుగా వారి ప్రొబెషనరీ కాలాన్ని నాలుగేండ్లకు పెంచుతూ సిఎం కెసిఆర్ బాంబు పేల్చారు. జెపిఎస్‌లలో అసంతృప్తి పెరిగిపోతుండటం, ఓవైపు విఆర్‌ఒ, విఆర్‌ఎల గొడవ నడుస్తుండటంతో సిఎం కాస్త ఆలోచించి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులతో సమానంగా ఇస్తామని ఊరటనిచ్చారు. కానీ, అమలు చేయలేదు. గతంలో ఇస్తున్న 15 వేల వేతనాన్ని రూ.28,719కి పెంచి ఊరటనిచ్చింది. వాస్తవానికి రెగ్యులర్ అయితే వారికి మరింత వేతనం పెరగడంతో పాటు పీఎఫ్, ఇతర ఉద్యోగులకు లభించినట్టుగానే అన్ని సౌకర్యాలు వర్తిస్తాయి. కానీ, రాష్ట్ర సర్కారు అలా చేయలేదు.

ఔట్‌సోర్సింగ్ జెపిఎస్‌లు పరిస్థితి మరీ దారుణం

పంచాయతీ కార్యదర్శులు రిటైర్డ్ అయినా, పంచాయతీరాజ్ జూనియర్ కార్యదర్శులు వివిధ కారణాలతో ఉద్యోగాలు మానేసినా 2019 నోటిఫికేషన్ మెరిట్ లిస్టులో ఉన్నవారిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్నది. మొదటి మూడు మెరిట్ లిస్టుల ద్వారా ఎంపిక చేసిన వారికి వేతనం రూ. 28,719 అందుతున్నది. ఆ తర్వాత మెరిట్ లిస్టు ద్వారా ఎంపికైన వారిని మాత్రం ఏజెన్సీల ద్వారా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమిస్తున్నారు. ఇలా పనిచేస్తున్నవారు రాష్ట్రంలో 1500 మంది వరకు ఉన్నారు. వీరికి మాత్రం ఒక్కో జిల్లాల్లో ఒక్కో విధంగా వేతనం అందుతున్నది. గరిష్టంగా రూ.15వేలు అందుతుండగా..కొన్ని జిల్లాల్లో అయితే రూ.11 వేలు మాత్రమే ఇస్తున్న దుస్థితి నెలకొంది. ఒకే ఎంట్రెన్స్ ద్వారా అర్హత సాధించిన వారికి వేర్వేరుగా వేతనాలు ఇవ్వడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

పెండింగ్‌లో వేతనాలు..ఆదుకునేటోళ్లు లేరు..

రాష్ట్ర సర్కారు జెపిఎస్‌లకు వేతనాలను కూడా సకాలంలో ఇవ్వడంలేదు. ఫిబ్రవరి, మార్చి నెల వేతనాలు ఇప్పటిదాకా జెపిఎస్‌లకు చేతికి అందలేదు. 'మూడు, నాలుగు నెలలకోసారి వేతనాలు ఇస్తే ఎలా బతకాలి? పొద్దుగాల ఏడు గంటలలోపే పంచాయతీలో పని ప్రదేశం నుంచి ఫొటో తీసి ఉన్నతాధికారులకు ఫొటో పెట్టాలి. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా పొద్దుగాల ఏడుగంటలకు వచ్చి సాయంత్రం ఆరేడు గంటల దాకా పనిచేస్తున్నారా?గొడ్డుచాకిరీ చేస్తున్నాం' అని నల్లగొండ జిల్లాకు చెందిన ఓ జెపిఎస్ తన ఆవేదనను వ్యక్తపరిచాడు. కొంతమంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అధిక పని భారాన్ని భరించలేక తమ ఉద్యోగానికి రాజీనామా చేసిపోతున్నారు. మరికొంతమంది విధి నిర్వహణలో తమ ప్రాణాలను కోల్పోతున్నారు. గుండెపోటు, గ్రామ పంచాయతీ నుంచి మండల కేంద్రాలకు, ఇండ్లకు వెళ్లే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇప్పటిదాకా దాదాపు 30 మంది జెపిఎస్‌లు చనిపోయారు. 50 మందిదాకా గాయపడ్డారు.

వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం సహకారం పెద్దగా లభించడంలేదు. జెపిఎస్‌లే తమ జీతాల్లోంచి తలా వెయ్యి, రెండు వేల రూపాయలు ఇచ్చి బాధిత కుటుంబాలకు కొంత ఆసరాగా నిలుస్తున్నారు.

జెపిఎస్‌లను క్రమబద్ధీకరించాలి
గౌరినేని రాజేశ్వర్‌రావు, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు

గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాం. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చూస్తున్నాం. హరితహారం, శానిటేషన్, జనన, మరణ ధ్రువీకరణలు, భవన నిర్మాణ అనుమతులు, ఆస్తి మార్పిడి పనులు , లైసెన్స్ అనుమతులు, ఉపాధి హామీ పనులు, కోవిడ్ సర్వేలు, డ్రై డేల నిర్వహణ, కంటి వెలుగు కార్యక్రమాలు, పోడు భూముల సర్వేలు, విపత్తు నిర్వహణ సంబంధించిన మొదలగు అనేక రకాల పనులను చేస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సర్వేలు కూడా చేస్తున్నాం. జాతీయస్థాయిలో పంచాయతీరాజ్ శాఖ నుంచి తెలంగాణకు ఉత్తమ అవార్డులు రావడంలో కీలకపాత్ర పోషిస్తున్నాం. మూడేండ్లకు పర్మినెంట్ అన్నారు. ఆ తర్వాత నాలుగేండ్లకు పెంచారు. నాలుగేండ్లవుతున్నా పర్మినెంట్ ఊసేలేదు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రొబేషనరీ పీరియడ్‌ను సర్వీస్ పీరియడ్‌గా మార్చాలని వేడుకుంటున్నాం. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్న జెపిఎస్‌లను కూడా పర్మినెంట్ చేయాలి.

గురుకుల విద్యార్థి అదృశ్యం విషాదాంతం

- రామసముద్రం చెరువులో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ గురుకుల విద్యార్థి అదృశ్యమైన ఘటన విషాదంగా ముగిసింది. రెండురోజుల కిందట ప్రిన్సిపల్‌కు తెలియకుండా నలుగురు విద్యార్థులు బయటకు వెళ్లారు. ముగ్గురు తిరిగి రాగా.. 9వ తరగతి విద్యార్థి మహేష్ కనిపించకుండా పోయాడు. గురుకుల పాఠశాల సిబ్బంది విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందజేయగా.. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా ఆదివారం రామసముద్రం చెరువులో అనుమానాస్పదంగా మహేష్ మృతదేహం లభ్యమైంది. విద్యార్థి మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుడి మృతికి కారకులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వారికి విద్యార్థి సంఘాలు, వివిధ రాజకీయ సంఘాలు మద్దతు తెలిపాయి. విద్యార్థి తల్లిదండ్రులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ఆయా సంఘాల నాయకులు భరోసా ఇచ్చారు. విద్యార్థి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, గురుకుల ప్రిన్సిపల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే భూపాల్ రెడ్డికి విద్యార్థి కుటుంబానికి న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంత్యక్రియల కోసం ఆర్‌సిఒ రూ.20 వేలు అందజేశారు. మృతుని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్టు సమాచారం.



సముద్రాల ద్వయం రాసిన గీతాలు సాహితీ సంపద

- ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణ

ప్రజాశక్తి-కల్చరల్

సముద్రాల రాఘవాచార్య, ఆయన కుమారుడు రామానుజాచార్య రచించిన గీతలు తెలుగు సాహితీ సంపద అని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణ కొనియాడారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్ కళా మందిరంలో యువ కళా వాహిని నిర్వహణలో సముద్రాల రామానుజాచార్య శత జయంతి సందర్భంగా ఆయన రచించిన గీతలపై డాక్టర్ వివి.రామారావు రచించిన అందమే ఆనందం విశ్లేషణాత్మక వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం జరిగింది.

ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. సముద్రాల జూనియర్‌గా పిలువబడే రామనుజాచార్య అందమే ఆనందం, ఈ నాటి ఈ హాయి, అమ్మా అని పిలిచిన అలకించ వేమమ్మ వంటి ఎన్నో సాహిత్య గుబాళింపులు వెదజల్లే గీతలు రాసి ఆ సినిమాల విజయానికి దోహదపడ్డారని గుర్తు చేశారు. రామారావు ఆ గీతాలలోని సౌందర్యాన్ని విశ్లేషించి మనకు అందించారని అభినందించారు. అధ్యక్షత వహించిన కళా పోషకుడు సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ.. రామారావు మంచి భాష విశ్లేషణతో సంపుటిని ఆద్యంతం చదివే విధంగా రాశారని ప్రశంసించారు. సముద్రాల రామానుజాచార్య రచించిన కష్ణ దాసి, శ్రీనివాస కల్యాణం సంపుటిలను ఆవిష్కరించారు. వేదికపై సాహితీవేత్త వోలేటి పార్వతీశం, గీత రచయిత సుద్దాల అశోక్ తేజ, సముద్రాల పార్థ సారధి, సుధ, గోపాలకష్ణ తదితరులు పాల్గొనగా సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ స్వాగతం పలికారు. సురేఖ, డాక్టర్ రామా రావు,పద్మశ్రీ, దుర్గ తదితరులు పాడిన సముద్రాల గీతాలు ఆకట్టుకున్నాయి.

గొల్ల కలాపం కూచిపూడి నృత్య రూపకంపై కార్యశాల

ప్రజాశక్తి-కల్చరల్

కూచిపూడి నాట్య కలాప ప్రక్రియలలో సిద్ధేంద్ర యోగి విరచిత భామా కలాపం ఆధునిక కాలంలో ప్రాచుర్యం పొందింది. 18వ శతాబ్దికి చెందిన గొల్ల కలాపం అంతగా ప్రచారంలో లేదు. ఆరున్నర దశాబ్దాల వార్షిక వేడుకలలో భాగంగా నవ్య నాటక సమితి గొల్ల కలాపంపై మే 6 నుంచి మూడు రోజులపాటు కార్యశాల శ్రీ కష్ణ భాషా నిలయంలో నిర్వహిస్తున్నారు. కలాపాలపై విశేష అవగాహన గల భాగవతులు రామ కోటయ్య కుమారుడు తెలుగు విశ్వవిద్యాలయం నృత్య శాఖ విశ్రాంత ఆచార్యులు భాగవతులు సేతురాం ఈ కార్యశాలలో గొల్ల కలాపంపై అవగాహనా తరగతులు నిర్వహిస్తారని నవ్య నాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ కుమార్, సుధా మాల తెలిపారు. ఇందుకు సంబంధించి గోడ పత్రికను సంస్థ కార్యాలయంలో రాష్ట్ర ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర అవిష్కరించారు. ఆసక్తిగల వారు నవ్య నాటక సమితి కార్యాలయంలో తెలియపరచాలని విజయకుమార్ కోరారు.

అంబులెన్సుల కోసం గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయాలి

- డాక్టర్ బి.భాస్కర్ రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అవయవాల రవాణా కోసం ఏర్పాటు చేస్తున్నట్టుగానే అంబులెన్సుల కోసం గ్రీన్ కారిడార్‌లను రూపొందించాలని కన్సార్టియం ఆఫ్ అక్రెడిటెడ్ హెల్త్‌కేర్ ఆర్గనైజేషన్స్ కాన్ఫరెన్స్ -2023 చైర్మన్ డాక్టర్ బి.భాస్కర్‌రావు సూచించారు. ఆదివారం హైదరాబాద్ కాన్ఫరెన్స్ ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అత్యధికంగా హైదరాబాద్‌లో ఒక ఏడాదిలో 100కుపైగా ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని తెలిపారు. ఇవే కాకుండా కాలేయం, కిడ్నీ, ఎముక మజ్జ మార్పిడి చికిత్సలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రంలో కాన్ఫరెన్స్ ప్రెసిడెంట్ విజయ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. తదుపరి 2024లో సదస్సు కోల్‌కతాలో జరుగుతుందని నిర్వాహకులు ప్రకటించారు.

మొక్కజొన్న కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాసంగిలో పండిన మొక్కజొన్నల కొనుగోలుకు మార్క్‌ఫెడ్ ద్వారా తక్షణమే చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం వరి కొనుగోలుపై చూపిన శ్రద్ధ ముతక ధాన్యాల సేకరణపై చూపడంలేదని పేర్కొంది. గత రెండేండ్ల క్రితం మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధరలకు ముతకధాన్యాలు కొనుగోలు చేసిందని తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి.సాగర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022-23లో 14.25 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, రాగులు, కొర్రలు, సజ్జ పంట వేశారని తెలిపారు. అందులో ఏడు లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగైందని పేర్కొన్నారు. మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.1,962 ఉందనీ, ప్రయివేటు వ్యాపారులు మాత్రం క్వింటాల్‌కు రూ.1200-1300లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్క్‌ఫెడ్ కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేసి కోళ్ళ పరిశ్రమకు, చేపల పెంపకానికి, పశువుల దాణాకు వినియోగించే వారికి అమ్మాలని సూచించారు. బీహార్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్న మొక్కజొన్నలపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు పెట్టాలని డిమాండ్ చేశారు.

పాత పెన్షన్ అమలు చేసే పార్టీలకే పట్టం

- ఎన్‌ఎంఒపిఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పాత పెన్షన్ అంశమే ప్రధాన ఎజెండా కాబోతుందనీ, అది అమలు చేసిన పార్టీలకు ప్రజలు పట్టం కడతారని ఎన్‌ఎంఒపిఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ పేర్కొన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్ ఎల్‌బీ స్టేడియం నుంచి లిబర్టీ అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర చేశారు. డా.బాబాసాహెబ్ అంబేద్కర్ నివాళులర్పించి ఆయన పాదాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్స్ స్కీం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 565 జిల్లాల్లో పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్‌లు జరుగుతున్నాయని సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ తెలిపారు.

అమెరికాలో మరో తెలుగు సంస్థ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉత్తర అమెరికాలో నివసిస్తున్న ప్రవాస తెలుగు ప్రజల కోసం సేవ, సంస్కృతి, సమానత్వం అందిస్తూ మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ, యువతను ప్రోత్సహిస్తూ వయోదిక పౌరులకు ఉత్తమమైన సంరక్షణను అందించడం లక్ష్యంగా మన అమెరికన్ తెలుగు అసోసియేషన్(మాటా) పేరిట ఒక కొత్త తెలుగు సంఘం ఏర్పడింది. ఏప్రిల్ 14 శుక్రవారం న్యూజెర్సీలోని రాయల్ ఆల్బర్ట్ పాలస్‌లో జరిగిన ఈ గ్రాండ్‌లాంచ్ ఈవెంట్‌లో దాదాపు 2500 మంది తెలుగు ప్రజలు పాల్గొన్నారు. డా.వడ్డేపల్లి కష్ణ రచించిన 'మాటా' స్వాగత గీతానికి పార్థసారథి సంగీతం అందించారు. ప్రముఖ నృత్యదర్శకులు స్వాతి అట్లూరి తన 70 మంది శిష్యబందంతో ప్రదర్శించిన నృత్యం సభికుల్ని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మాటా వ్యవస్థాపకులు శ్రీనివాస్ గనగోని, ప్రదీప్‌సామల మాట్లాడారు. సేవా, సంస్కృతి, సమానత్వం అనే ప్రధాన సూత్రాల ఆధారంగా ఈ సంస్థను స్థాపించడం జరిగిందని వివరించారు. లక్ష్మి మోపర్తి ఆధ్వర్యంలో యూత్‌టీమ్ మిషన్, విజన్‌ను ప్రదర్శించారు. ప్రముఖ నేపథ్య గాయని సునీత, గాయకుడు అనిరుధ్ తమ మరపురాని సంగీత కచేరితో సభికులను అలరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ అసోసియేషన్ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో





సుదీర్ఘకాలం పాటు పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ జిల్లా సుబేదారిలోని ప్రభుత్వ లా కళాశాలలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు అధ్యక్షతన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై ఉన్న స్టే తొలగించడానికి ఎర్లీ హియరింగ్ పిటీషన్ వేసి, ఈ వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని తెలిపారు. వేతనాలు ప్రతి నెల ఒకటవ తారీఖున చెల్లించాలని, ఉపాధ్యాయుల పిఎఫ్, టిఎస్‌జిఎల్‌ఐ, తదితర పెండింగ్ బిల్లులను అదే టోకెన్ నెంబర్‌పై ఏప్రిల్ చివర్లో చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేస్తూ తక్షణం ఉత్తర్వులు విడుదల చేయాలని, పండిట్, పిఇటి అప్‌గ్రేడ్ పోస్టులకు పదోన్నతులు ఇవ్వాలని, డిఇఒ చేతిలో ఉన్న 7,000 ఉపాధ్యాయ ఖాళీలను ఐఎఫ్‌ఎస్‌ఎంఐఎస్ వెబ్‌సైట్‌లో చూపాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ అధ్యాపకుల వేతనాలు 30 శాతం పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వాలని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్పు చేసి అధ్యాపక పోస్టులను మంజూరు చేయాలని కోరారు. కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని, ఎయిడెడ్, రెసిడెన్షియల్, కేజీబీవీ, డిగ్రీ కళాశాలలో కేర్ టేకర్లను నియమించి మహిళా ఉపాధ్యాయులు, అధ్యాపకులకు రాత్రివేళ డ్యూటీ నుంచి మినహాయించాలన్నారు. కేజీబీవీ సిబ్బందికి మినిమం బేసిక్ పే ఇవ్వాలని, మోడల్ స్కూల్ టీచర్లకు బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని తెలిపారు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే. సోమశేఖర్, ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ కుమార్ లోధి, కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పస్కుల శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు నన్నేపోయిన తిరుపతి, రావుల రమేష్, డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆసనాల శ్రీనివాస్, టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎం. సదాశివరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాటికాయల కుమార్, బద్దం వెంకటరెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి ప్రాధాన్యత

- మంత్రి హరీశ్‌రావు
- ఎంఎన్‌జె క్యాన్సర్ ఇన్సిట్యూట్‌లో అంకాలజీ బ్లాక్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



అంకాలజీ విభాగాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పేదల వైద్యానికి కెసిఆర్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గత ప్రభుత్వాలు ప్రభుత్వ ఆస్పత్రులను పట్టించుకున్న పాపన పోలేదని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్ లక్డికపూల్‌లోని ఎంఎన్‌జె క్యాన్సర్ ఇన్సిట్యూట్‌లో నూతన అంకాలజీ బ్లాక్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎంఎన్‌జె చారిత్రక ఆస్పత్రిలో నూతన బ్లాక్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇంత మంచి బిల్డింగ్‌ను నిర్మించి ప్రభుత్వానికి అందించినందుకు అరబిందో ఫార్మాకు ధన్యవాదాలు తెలిపారు. ఈ బిల్డింగ్ రావడంతో పడకల సంఖ్య 750కి పెరిగిందని.. ప్రభుత్వం పరంగా రూ. 60 కోట్లతో ఇక్కడ అన్ని సదుపాయలు కల్పించామని చెప్పారు. దేశంలోనే ప్రభుత్వ రంగంలో కేన్సర్ ట్రీట్మెంట్‌కు 2వ అతి పెద్ద ఆస్పత్రిగా ఎంఎన్‌జె నిలిచిందన్నారు. కొత్త బ్లాక్‌లో ప్రత్యేకంగా వుమెన్ వింగ్, పెడియాట్రిక్ వింగ్ రానున్నాయని తెలిపారు. చికిత్స కోసం వచ్చే చిన్నారుల చదువు దెబ్బ తినకుండా ఉండేందుకు పెడియాట్రిక్ వింగ్‌లో లైబ్రరీ, టీచర్‌ను ఏర్పాటు చేసి ట్రీట్మెంట్‌తో పాటు విద్యను కూడా అందిస్తామన్నారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ప్రత్యేకంగా వార్డు ఏర్పాటు చేశామని చెప్పారు. వీరికి ఆరోగ్య శ్రీ కింద జీవితాంతం మందులు ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. ఇక ఆస్పత్రి శానిటేషన్, సెక్యూరిటీ నిర్వహణకు ముందుకొచ్చిన ప్రముఖ వైద్యులు అద్దంకి శరత్, సినీనిర్మాత సునీతను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మరోవైపు నాలుగు టిమ్స్, వరంగల్ హెల్త్ సిటీ, నిమ్స్ విస్తరణతో 10వేల పడకలు సూపర్ స్పెషాలిటీ బెడ్స్‌ను మరో ఏడాదిలో అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. వైద్య విద్యకు కూడా ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని, ఈ సంవత్సరం మరో తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తామని తెలిపారు. కేన్సర్ రోగులకు త్వరలో జిల్లాల్లో కీమో, రేడియో థెరపీలను జిల్లాల్లో ప్రారంభిస్తామని చెప్పారు. టీ డయాగ్నోస్టిక్ సెంటర్స్ ద్వారా కేన్సర్ డిటెక్షన్ చేయనున్నామని తెలిపారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, ఆహార నియమాలతో పాటు వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, ఎమ్మెల్సీ ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, టిఎస్‌ఎంఎస్‌ఐడిసి చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, అరబిందో ఎండీ నిత్యనంద రెడ్డి, అరబిందో డైరెక్టర్ రఘునాథన్, హెల్త్ సెక్రటరీ రిజ్వి, ఎంఎన్‌జే ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జయలత తదితరులు పాల్గొన్నారు.

లీజు నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు

- రూ.వెయ్యి కోట్ల విలువైన స్థలాలను వెనక్కి తీసుకున్నాం
- మంత్రి శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



లీజు నిబంధనలు ఉల్లంఘించి ప్రాజెక్టులు చేపట్టిన వారిపై కేసులు నమోదు చేసినట్టు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వారికి కేటాయించిన రూ.1,000 కోట్ల విలువైన రెండు స్థలాలను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నదని చెప్పారు. ఏడాది కాలంలో రూ.50 కోట్ల పాత బకాయిలను వసూలు చేసినట్టు తెలిపారు. ఆ భూములను ప్రభుత్వానికి స్వాధీనం చేయడంలో కృషి చేసిన పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎండీ మనోహర్, ఓఎస్‌డీ సత్యనారాయణ, లీగల్ ఆఫీసర్ ఆదిల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. శామీర్‌పేట్, జవహర్‌నగర్‌లోని సర్వే నెంబర్ 12లో సికింద్రాబాద్ గోల్ఫ్ కోర్స్ అభివృద్ధి పేరుతో ప్రజయ్ ఇంజనీర్స్ సిండికేట్ సంస్థ 130 ఎకరాల టూరిజం శాఖకు చెందిన భూమిని 2004 సంవత్సరంలో తీసుకుని లీజు నిబంధనలు పాటించలేదని మంత్రి తెలిపారు. సికింద్రాబాద్‌లోని యాత్రి నివాస్ పక్కన ఉన్న 4,600 గజాల విలువైన భూమిని ఇ-సిటీ జెయింట్ స్క్రీన్ (ఇండియా) ప్రయివేట్ లిమిటెడ్ లీజుకు తీసుకుని నిబంధనలు పాటించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిందని తెలిపారు. ఆ రెండు సంస్థలు ఎలాంటి ప్రాజెక్టు చేపట్టలేదని స్పష్టం చేశారు. సమావేశంలో తెలంగాణ పర్యాటక సంస్థ చైర్మెన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, మనోహర్ , ఓఎస్ డీ సత్యనారాయణ, లీగల్ ఆఫీసర్ ఆదిల్ పాల్గొన్నారు.



కోటి మందికిపైగా కంటి పరీక్షలు

- 10 వేల మంది మహిళలకు వైద్య పరీక్షలు
- సమాచార, పౌర సంబంధాలశాఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. అన్ని రకాల జబ్బులను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా ప్రజల ఆరోగ్యం కాపాడటంతోపాటు వారిపై ఆర్థిక భారం పడకుండా ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. కంటి వెలుగు రెండో దశ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 1,08,99,470 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో 17,20,200 మందికి ఉచితంగా రీడింగ్ గ్లాసెస్‌ను, అవసరమైన ఔషధాలను అందజేశారు. 13,11,858 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ ఇవ్వాలని పరీక్షల ద్వారా గుర్తించారు. 78,67,170 మందికి కంటి సమస్యలు లేవని నిర్ధారించారు.

జనవరి 19న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 15 వరకు 100 పనిదినాల్లో కొనసాగనున్నది. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు నిరంతర పర్యవేక్షణ, ప్రణాళిక ద్వారా విజయవంతంగా నిర్వహిస్తూ ప్రజల మన్ననలను అందుకుంటున్నది. 40 ఏండ్లు పైబడిన వారిలో ఎక్కువగా దగ్గర చూపు కనిపించడం లేదని వైద్యులు, 50 ఏండ్లు పైబడిన వారికి ఎక్కువగా కాటరాక్ట్ సమస్య ఉన్నట్టు బయటపడుతున్నాయి. "అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభమై ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 100 కేంద్రాల్లో దీని ద్వారా మహిళలు ప్రధానంగా ఎదుర్కొంటున్న వ్యాధులను గుర్తించేందుకు ఇప్పటి వరకు 10 వేల మందికి ఎనిమిది రకాల పరీక్షలను చేశారు. అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించి వారిని చికిత్స కోసం ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు.... " అని సమాచార, పౌర సంబంధాలశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్‌గా రాజా వరప్రసాద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్‌గా రాజావరప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని ఆదివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఛైర్మన్, సభ్యులు తిరుమల మహేష్‌కు మంత్రి శాలువా కప్పి సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజావరప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తామనీ, సహకార సంఘాల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

బిఆర్ఎస్‌లో జోరుగా చేరికలు

- కెసిఆర్ సమక్షంలో చేరిన మహారాష్ట్ర నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

బిఆర్ఎస్ పార్టీలోకి మహారాష్ట్ర నుంచి చేరికల జోరు కొనసాగుతోంది. నాందేడ్, కాందార్‌లోహ వంటి తెలంగాణ సరిహద్దు ప్రాంతాల నుంచి మొదలైన ఈ చేరికల పర్వం, మధ్య మహారాష్ట్రకు చేరుకుంది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని బిఆర్ఎస్ అధినేత, సిఎం కెసిఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే అన్నా సాహెబ్‌మానె, సంతోష్ మానె, ప్రశాంత్ పాటిల్, గంగాపూర్ నియోజక వర్గానికి చెందిన సంతోష్‌కుమార్, ఔరంగాబాద్ ఎన్‌సిపి యూత్ అధ్యక్షులు ప్రశాంత్ పాటిల్, సంతోష్‌కుమార్‌కు సిఎం కెసిఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, విప్ బాల్కసుమన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ రెండోదశకు మోక్షమెప్పుడు..?

- 4.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ పెండింగ్
- చెప్పిందొకటి..చేస్తున్నదొకటి !
- అధికమవుతున్న అంచనా వ్యయం
- ఉమ్మడి రాష్ట్ర ప్రాజెక్టు పట్ల అలక్ష్యం



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

"నా తెలంగాణ కోటి రతనాల వీణ" అన్నారు దాశరథి. అదే తెలంగాణ ఉద్యమ నినాదమై మార్మోగింది. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే పోరాటం చేపట్టిన మాట అందరికీ ఎరుకే. ఉమ్మడి రాష్ట్ర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయబోమని, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా పూర్తి చేస్తామనే హామీని సైతం గతంలో టిఆర్ఎస్ సర్కారు ఇచ్చింది. ఆచరణలో అడుగుదూరం కూడా పడలేదు. ఆ ప్రాజెక్టుల పట్ల అలసత్వం కనిపిస్తోంది. టిఆర్ఎస్ అధికారంలోకి రాగానే ప్రతియేటా రూ.25 వేల కోట్లను సాగునీటి ప్రాజెక్టులకు కేటాయిస్తామని చెప్పారు. ఈ ఏడాదితో రెండుసార్లు మాత్రమే అలా చేయగలిగారు. మిగతా సంవత్సరాల్లో తగ్గించారు. కార్పొరేషన్ల ద్వారా నిధులు సమకూర్చుకుంటున్నారు. సిఎం కెసిఆర్ మానసపుత్రిక కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆ తరహాలోనే కాసులు తెచ్చారు. మిగతా 18 భారీ, 31 మధ్యతరహా ప్రాజెక్టులపై మాత్రం శీతకన్నేశారు. కేటాయింపులు చేస్తున్నామంటూనే ఏ ఒక్క ప్రాజెక్టునూ ఏడేండ్లుగా పూర్తిచేయకపోవడం గమనార్హం. కొన్ని ప్రాజెక్టులకు రీడిజైన్ చేశారు. గత ఏడేండ్లల్లో మధ్యతరహా ప్రాజెక్టులు పూర్తిచేసే అవకాశం ఉన్నా, ఆ ప్రణాళికే లేకపోవడం చర్చనీయాంశమవుతుంది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో 4.40 లక్షల ఎకరాలకు సాగునీరందించే శ్రీరాంసాగర్ (ఎస్ఆర్ఎస్‌పి) ప్రాజెక్టు రెండో దశ పనుల్లో తీవ్ర ఆలస్యమే ఇందుకు సాక్ష్యం.

రెండోదశ ..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశ పనులు పూర్తిచేస్తే ఖమ్మం జిల్లాలోని 68,914 ఎకరాలు, వరంగల్‌లోని 1,13,575 ఎకరాలు, నల్లగొండ జిల్లాలోని 2,57,508 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. తద్వారా ఈ మూడు జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయి. ఈ ప్రాజెక్టు ప్రధాన కాలువ పనులు పూర్తయినా, నీటిని పంపిణీ చేసే ఉపకాలువల పనులు ఇంకా ఆలస్యమవుతూనే ఉన్నాయి. ఈ రెండో దశకు 40 టిఎంసిల నీరు అవసరం. ఈ నీరు శ్రీరాంసాగర్ కాకతీయ కాలువ ద్వారా దిగువకు రావడం గత దశాబ్దకాలంలో సాధ్యం కానిది. కాకతీయ కాలువకు 234వ కిలోమీటర్ వరకే నీరు వస్తున్నది. మొదటి దశలోని 234-284 కిలోమీటర్లకు కూడా నీరందడంలేదు. పై 50 కిలో మీటర్లలో మొరంచ, తీగలవేని, వెన్నవరం కాలువలకు కూడా నీరు రావడం లేదు. 284 నుంచి 343 కిలోమీటర్ల వరకు గత రెండు దశాబ్దాలుగా నీళ్లు రాలేదు. కాళేశ్వరం ద్వారా స్థిరీకరిస్తామని చెప్పినా, అమలుకాలేదు. కాలువలు పూర్తయినా ఇప్పడవి శిథిలావస్థకు చేరుకున్నాయి. కాకతీయ కాలువ మొదటి దశ 50 కిలోమీటర్లతోపాటు రెండో దశకు 70 టిఎంసిల నీరు కావాల్సి ఉంటుంది. ఈ నీటిని దేవాదుల లిఫ్ట్ ద్వారా గానీ, లేదా కాంతాలపల్లి ఎత్తిపోతల ద్వారాగానీ సరఫరా చేయడానికి వీలుంది. ఇదొక్కటే మార్గం. ఈ ప్రాజెక్టులతో రెండో దశకు నీటిని అందించడం ద్వారా మాత్రమే శాశ్వత ప్రయోజనం కలుగుతుంది. అలాగే రెండో దశలోనే సరస్వతి కాలువ ద్వారా 79000 ఎకరాలు(77-144 కిలోమీటర్లు), కడెం ఆయకట్టు స్థిరీకరణ 68000 ఎకరాలనూ చేర్చారు.

శంకుస్థాపనలు

ఈ ప్రాజెక్టు రెండోదశకు మూడుసార్లు శంకుస్థాపనలు జరిగాయి. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ, ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్‌తో కలిసి 1984, మే నాలుగో తేదీన శంకుస్థాపన చేశారు. కాగా చంద్రబాబు 1996 మార్చి ఆరున ఒకసారి, 2002 మే తొమ్మిదిన రెండోసారి శంకుస్థాపన చేయడం గమనార్హం. తొలుత ఈ ప్రాజెక్టు వ్యయం సాగునీటి పారుదల, ఆయకట్టు శాఖ రూ.1258 కోట్లుగా నిర్ధారించింది. ప్రధాన ఉపకాలువలు డిబిఎం 30, డిబిఎం 40, డిబిఎం 48 కాలువలు తవ్వినా లైనింగ్ చేయలేదు. చేసినవీ కూలిపోయాయి. ఇప్పటికీ వీటి పునరుద్ధరణకు ప్రణాళికలే లేవు. పదేళ్లపాటు కాలువల తవ్వకాలను నిర్లక్ష్యం చేశారు. అనంతరం కొద్దిమేర కదలిక వచ్చింది. నిధులిచ్చారు. వాటినీ కాంట్రాక్టర్లు, అవినీతి అధికారులు కాజేశారు. పనులు చేయకుండానే చేసినట్టు ఎంబిలు నమోదు చేసి విలువైన ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కయి ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో దాదాపు 12 మంది అసిస్టెంట్ ఇంజినీర్ల (ఎఇ)ను అప్పట్లో ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కాగా ఎలాంటి విచారణ చేయకుండానే సస్పెండైన ఎఇలను మూడేళ్ల తర్వాత మళ్లీ విధుల్లోకి తీసుకోవడం అప్పట్లో భారీ చర్చకు దారితీసింది.

ఇది పరిస్థితి

ఖమ్మం జిల్లా 68,914 ఎకరాలకు నీరిచ్చేందుకు పాలేరు నుంచి భక్తరామదాసు లిఫ్ట్‌పెట్టారు. పాలేరు ఆయకట్టుకు కృష్ణానది నుంచి ఇస్తున్నారు. భక్తరామదాసు లిఫ్ట్ ద్వారా ఖమ్మం జిల్లాలోని గోదావరి ఆయకట్టుకు మళ్లించారు. గోదావరిలో సరిపోను నీళ్ల ఉన్నాయి. కాకతీయ కాలువ ద్వారా ఇచ్చే అవకాశం ఉంది. కృష్ణాకు లింకుపెట్టి ఖమ్మంలో పబ్బంగడిపారు. రెండోదశకు ఇప్పటికీ నీటి కేటాయింపుల గ్యారంటీ లేదు. కరీంనగర్, వరంగల్ సరిహద్దు వరకు మొదటిదశ శ్రీరాంసాగర్ నీళ్ల వస్తున్నాయి. కిందకు వదలడంతో వరంగల్ నగరానికి తాగునీటిని అందిస్తున్నారు. వడ్డేపల్లి, భద్రకాళి చెరువును నింపుతున్నారు. దేవాదుల ప్రాజెక్టుతో ధర్మసాగర్ చెరువు నీటిసమస్య తీరుతున్నది. కానీ రెండో దశకు నీళ్లీవ్వడంపై 1984 నుంచి దృష్టిపెట్టలేదు. డిబిఎం 48ని నిర్మించాల్సి ఉంది. 4.40 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రాంతం నిరంతరం నీటి కరువుతో ఉంది. వర్ధన్నపేట, తిరుమలగిరి, వరంగల్, ఖమ్మం మూసీ ప్రాంతానికి ఇప్పటికీ నీరు అందటం లేదు.

24, 25 తేదీల్లో ఐద్వా రాష్ట్ర కమిటీ సమావేశాలు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



యాదగిరిగుట్టలో ఐద్వా రాష్ట్ర కమిటీ సమావేశాలు ఈ నెల 24, 25వ తేదీల్లో నిర్వహిస్తున్నామని, సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపు నిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆదివారం ఆమె మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకొచ్చాక మహిళల హక్కులపై దాడి జరుగుతున్న పరిస్థితి ఉందన్నారు. లైంగికదాడులు కూడా బాగా పెరిగి పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల పట్ల చిన్నచూపు చూసే సంస్కృతి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల సమస్యలపై రెండురోజులపాటు జరిగే సమావేశంలో చర్చించి పోరాట కార్యక్రమాలు రూపొందిస్తామని తెలిపారు. సమావేశాలకు ఐద్వా జాతీయ సహాయ కార్యదర్శి సుధా సుందరరామన్, జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతితో పాటు ఇతర నాయకులు హాజరవుతారన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టిపల్లి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో విద్యార్థుల జీవితాలతో బిఆర్ఎస్ ప్రభుత్వం చెలగాట మాడుతుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి అన్నారు. ఆదివారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు అడపా సంతోష్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించగా ఆర్ఎల్ మూర్తి హాజరై 'ప్రస్తుత రాజకీయం విద్యారంగంపై ప్రభావాలు' అంశంపై మాట్లాడారు. టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీలు చేస్తూ చదువుకున్న విద్యార్థులకు ఉపాధి కల్పించకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. పేపర్ లీకేజీలతో నష్టపోయిన నిరుద్యోగులకు నష్ట పరిహారం ఇవ్వకుండా, విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా, గురుకుల విద్యార్థులకు వేసవి సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోందన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురాకుండా విద్యారంగం పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పెండింగ్ మెస్, కాస్మొటిక్, మధ్యాహ్న భోజనం బిల్లులు విడుదల చేయాలని కోరారు. సెలవుల్లో ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నడపకూడదని చెబుతూనే.. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో సమ్మర్ క్లాస్‌లు ఎలా బోధిస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దమెర కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి రాజు, బోడ్డు స్మరన్, బోడ్డు కిషోర్, జిల్లా కమిటీ సభ్యులు రాజు, రిత్వక్, విష్ణు, అంజి, సాగర్, శేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపిది అబద్ధాల మార్చ్

- పేపర్ లీకువీరుల మార్చ్ హాస్యాస్పదం
- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

'వరంగల్‌లో బిజెపి రాజకీయ నిరుద్యోగుల మార్చ్ జరిగింది. అది అబద్ధాల మార్చ్. ఆ పార్టీకి నిరుద్యోగుల గురించి మాట్లాడే హక్కు లేదు. తెలంగాణలో కాదు ఢిల్లీలో చేయాలి. మోడీ రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. వాటిపై మోడీని నిలదీయాలి. పేపర్ లీకు వీరులు నిరుద్యోగ మార్చ్ చేయడం హాస్యాస్పదం అందులో నిరుద్యోగులు లేరు.. అడ్డమీద కూలీలే ఉన్నారు' అని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్ కె.వాసుదేవరెడ్డితో కలిసి బిఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగులు ప్రభుత్వం కల్పించిన వసతులతో పరీక్షలకు సిద్ధమవుతున్నారని, రోడ్ల మీదకు ఎవ్వరూ నిరుద్యోగులు రారని అన్నారు. పదో తరగతి పేపర్ల లీకేజీ కుట్రదారు అని వాట్సాప్ చాట్‌లతో రుజువైందని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్‌ది గాంధీ సిద్ధాంతం, బిజెపి ది గాడ్సే సిద్ధాంతమని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో బిజెపి చిచ్చు పెట్టాలనుకుంటోందని విమర్శించారు. విభజన చట్టం అమలుకు ఢిల్లీలో బిజెపి ధర్నా చేస్తే తామూ మద్దతు ఇస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం దగ్గరకు బిజెపి నేతలు వస్తే అభివద్ధిపై చర్చిద్దామని సవాల్ విసిరారు. మతం, కులం ఆధారంగా బిజెపి ప్రజలను విడగొడుతున్నదని, ఆ కుట్రలను బిఆర్ఎస్ తిప్పి కొడుతుందని చెప్పారు. వాసుదేవరెడ్డి మాట్లాడుతూ బిజెపికి దమ్ముంటే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యోగాల భర్తీపై తమ పార్టీ ఇప్పటికే శ్వేత పత్రం ప్రకటించిందని గుర్తుచేశారు.

స్టేజీ కూలడంతో.. మంత్రి గంగులకు గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి గ్రామానికి వెళ్లిన మంత్రి గుంగుల కమలాకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కరీంనగర్ రూరల్ మండలం చర్ల బూత్కూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం గ్రామంలో చిరుతల రామాయణం నిర్వహిస్తున్నారన్న విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లి గ్రామస్తులను కలుసుకోవాలని భావించారు. చిరుతల రామాయణం జరుగుతున్న వేదికపైకి మంత్రి చేరుకోగానే ఆయన వెంట ద్వితీయ శ్రేణి నాయకులు పెద్ద ఎత్తున స్టేజీ పైకి ఎక్కారు. బరువు అధికం కావడంతో డయాస్ కిందకి జారింది. దీంతో మంత్రి గంగుల కమలాకర్ కాలికి స్వల్ప గాయం కాగా వెంటనే కరీంనగర్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకువచ్చి పరీక్షలు నిర్వహించారు. కాలికి ఫ్యాక్చర్ ఏమి కాలేదని నిర్ధారించిన వైద్యులు క్రేప్ బ్యాండేజ్ వేసి రెస్ట్ తీసుకోవాలని సూచించినట్టు సమాచారం. మంత్రి గంగుల కమలాకర్ కాలికి గాయమైన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, మేయర్ సునీల్ రావు.. మంత్రి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.



సిఐటియు తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభ సావనీర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

సిఐటియు రాష్ట్ర నాలుగో మహాసభ సావనీర్‌ను ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్, కోశాధికారి వంగూరు రాములు చేతుల మీదుగా ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. 2022 డిసెంబర్ 21, 22, 23 తేదీల్లో సిద్ధిపేటలో దిగ్విజయంగా జరిగిన నాలుగో రాష్ట్ర మహాసభ విశేషాలు సావనీర్‌లో ఉన్నాయి. ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్క రాములు స్వాగతోపన్యాసం, దేశంలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ విధానాలపై సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ విలువైన సమాచారంతో కూడిన వ్యాసం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, పూర్వ ప్రధాన కార్యదర్శి ఆర్.సుధాభాస్కర్ రాసిన వ్యాసాలతోపాటు ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.గోపాలస్వామి కృతజ్ఞతల వ్యాసం, అభినందనలతో కూడిన ప్రకటనలతో ఈ సావనీర్ ఆకర్షణీయంగా వెలువడింది. 700 మంది ఎంపిక చేసిన ప్రతినిధులతో మూడురోజులపాటు జరిగిన మహాసభ, ముగింపు రోజు వేలాది మందితో జరిగిన బహిరంగ సభ నిర్వహణ ఎంతో వ్యయ, ప్రయాసాలతో కూడుకున్నదనీ, దీని జయప్రదానికి తోడ్పడిన దాతలు, శ్రేయోభిలాషులు, వ్యాపార, వాణిజ్య, ప్రముఖులు, వేలాది కార్మికులు ప్రతి ఒక్కరికీ పాలడుగు భాస్కర్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కార్మికవర్గ హక్కుల సాధనకు ఈ మహాసభ స్ఫూర్తివంతంగా నిలిచిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఎస్.వీరయ్య, జె.వెంకటేష్, ఎస్.రమ, పి.జయలక్ష్మీ, వీఎస్‌రావు, కళ్యాణం వెంకటేశ్వర్లు, టి.వీరారెడ్డి, జె.మల్లికార్జున్, జె.చంద్రశేఖర్, బి.మల్లేష్, బి.మధు, ఎ.ముత్యంరావు, ఎం.వెంకటేష్, రాగులరమేష్, ఎజె.రమేష్, పి.శ్రీకాంత్, కూరపాటి రమేష్, కె.ఈశ్వర్‌రావు, కె.గోపాలస్వామి తదితరులున్నారు.

మూతపడ్డ ఒక్క పరిశ్రమనైనా తెరిపించారా?


- విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి మాట్లాడే నైతిక హక్కు ఉందా?
- కెసిఆర్‌ను ప్రశ్నించిన కిషన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో పాలనను సిఎం కెసిఆర్ గాలికి వదిలేసి టిఆర్ఎస్ పేరుతో కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..'విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కొంటామని సింగరేణి అధికారులను ఆగమేఘాల మీద వైజాగ్ పంపించారు. మంత్రులు కూడా స్టీల్ ప్లాంట్ అంశంపై అనేక ప్రకటనలు చేశారు. సింగరేణిలో పనిచేసే కార్మికులు అసంతృప్తితో ఉన్నారు. ప్రధాని అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వస్తే బిఆర్ఎస్ నిరసనలు చేపట్టింది. సింగరేణిని కేంద్రం ప్రైవేటు పరం చేస్తుందంటూ నిరసనలు చేపట్టారు. తెలంగాణలో అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. ఒక్క పరిశ్రమనైనా తెరిపించారా?కెసిఆర్ చెప్పాలి. వందరోజుల్లో నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని హామీ ఇచ్చారు. తొమ్మిదేళ్ల అవుతున్నా నిజాం షుగర్స్‌కు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. సిఎం కేసీఆర్‌కు విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడే నైతిక హక్కు ఉందా? స్టీల్ ప్లాంట్ పేరుతో గాంభీర్యాలు ప్రదర్శిస్తున్నారు. తొమ్మిదేళ్ల తర్వాత కెసిఆర్ నిద్ర మేల్కొని అంబేద్కర్ జయంతి రోజున నివాళులర్పించారు. దళిత బంధు కాస్త బిఆర్ఎస్ బంధు అయ్యింది. అవినీతిపై ఆరోపణలు వస్తే దర్యాప్తు జరపవద్దని రాజ్యాంగంలో రాసి ఉందా? చట్టం తనపని చేసుకుంటూ పోతుంది... ఎవరి జోక్యం ఉండదు' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

ప్రగతి సింగారంలో దర్జాగా ప్రభుత్వ భూముల కబ్జా

- చేతులు మారుతున్న లావణి పట్టా భూములు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- ఎమ్మెల్యే 'చల్లా' స్వగ్రామంలో పరిస్థితి
- క్వారీ భూముల అమ్మకాలు, క్రీడా ప్రాంగణ భూముల ఆక్రమణ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ భూముల ధరలు ఆకాశాన్ని అంటడంతో భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తూ, లక్షలాది రూపాయలకు భూములు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. క్రషర్ యజమానులు క్వారీల్లో బండరాళ్లను తొలగించడంతో గుట్టలు కనుమరుగు కాగా, భూకబ్జాదారులు యధేచ్ఛగా చెరువులోని పూడికతీత మట్టితో గుంతలను పూడ్చి, వ్యవసాయ భూములుగా మార్చివేసి విక్రయాలు చేపడుతున్నారు. సర్వే నెంబర్ 138లో లావణి పట్టా భూములను విక్రయిస్తూ లక్షల్లో లాభాలు గడిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఈ భూమి పరకాల ఎమ్మెల్యే స్వగ్రామం ప్రగతి సింగారంలోనిది కావడం విశేషం.

పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్వగ్రామమైన మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో సర్వే నెంబర్ 138లో 53 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలోనే పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటిక, రైతు వేదిక నిర్మాణాలను చేపట్టారు. అప్పయ్య పల్లె గ్రామానికి చెందిన గుజ్జుల కాశీరాంకు ప్రగతి సింగారం శివారులో వ్యవసాయ భూములు అధికంగా ఉండటంతో 30 ఏండ్ల కిందట దళితులు అతనిపై పోరాటం చేయడంతో 2-10 ఎకరాల భూములను దళితులకు అప్పగించారు. మిగతా పట్టా భూములను, అసైన్డ్ భూములను విక్రయించుకున్నాడు. వీరి వద్ద భూములు కొనుగోలు చేసిన రైతులకు, అసైన్డ్ భూములను సాగు చేస్తున్న దళితులకు గొడవలు తలెత్తుతున్నాయి. చిలికి చిలికి గాలి వానలా భూ పంచాయితీ చివరికి అధికార పార్టీ నాయకుల వద్దకు శుక్రవారం చేరగా భూమికి సంబంధించిన కాగితాలు తీసుకురావాలని, క్షేత్రస్థాయిలోకి వెళ్లి చుట్టుపక్కల రైతులను విచారించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

క్వారీ భూములు కబ్జా..

ప్రగతి సింగారం గ్రామ శివారులో ఉన్న క్వారీల్లో క్రషర్ యజమానులు గుట్టల్లో బాంబు పేలుళ్ల చేసి బండరాళ్లను తొలగించి కంకర, డస్ట్ తయారు చేసి విక్రయిస్తుండడంతో గుట్టలు కరిగిపోయి మైదాన ప్రదేశాలు వచ్చాయి. కాశి కుటుంబీకులు పెద్దపెద్ద బండ రాళ్లను యంత్రాల సహాయంతో కట్టుబడి రాళ్లగా తయారు చేసి విక్రయించుకుంటున్నారు. భూ కబ్జాదారులు ఈ భూములపై కన్నేసి మైదానంలో ఏర్పడిన గుంతలను గ్రామంలోని చెరువుల నుంచి తోడిన మొరం మట్టితో పూడ్చివేసి వ్యవసాయ భూములుగా మార్చారు. ఈ భూములను లక్షలాది రూపాయలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

క్రీడా ప్రాంగణ భూముల కబ్జా..

ప్రగతి సింగారం గ్రామంలోని ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించి క్రీడా ప్రాంగణ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు. దాంతో స్థానిక సర్పంచ్ పోతు సుమలత రమణారెడ్డి అధికారులు సూచించిన స్థలంలో క్రీడా ప్రాంగణం పనులు మొదలు పెట్టగా ఆ స్థలం తమదేనంటూ స్థానిక కాలనీవాసులు అడ్డుకున్నారు. ఇదే విషయమై సర్పంచ్.. స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు క్రీడా ప్రాంగణం బోర్డు, పరికరాలను తీసుకురాగా స్థానికులు బోర్డును ఏర్పాటు చేయకుండా అడ్డుకోవడంతో నేలపైనే బోర్డు దర్శనమిస్తుంది. ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో క్రీడా ప్రాంగణ భూములను ఆక్రమించుకున్న వారి నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. డీపీవో ఆదేశాల మేరకు రెండు గుడిసెలను తీసివేసినప్పటికీ, మరొకరు అడ్డుకోవడంతో క్రీడా ప్రాంగణ పనులు నిలిచిపోయాయి. దాంతో యువకులకు క్రీడా ప్రాంగణం అందుబాటులో లేకుండా పోయింది.

మూడు కుంటలు ఆక్రమణ..

ప్రగతి సింగారం గ్రామంలోని పోచమ్మ కుంట, కరక్కుంట, ఇప్పలకుంట చెరువులను సమీపంలోని భూములను కబ్జా చేసి కుంటల విస్తీర్ణాన్ని పూర్తిగా కుదించారు. కుంటలు అంతరించిపోతే కుంటల కింద సాగయ్యే ఆయకట్టు రైతుల పరిస్థితి ఏమిటని, పంట సాగు ఎలా చేసుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, సర్పంచ్ పోతు సుమలత రమణారెడ్డి స్వగ్రామమైన ప్రగతి సింగారం గ్రామంలో ప్రభుత్వ భూములను భూకబ్జాదారులు యధేచ్ఛగా కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూకబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం : చలమల్ల రాజు, తహసీల్దార్

ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసినా రిజిస్ట్రేషన్ జరగదు. పిఒటి -1977 యాక్ట్ ప్రకారం ప్రభుత్వ భూములను రెగ్యులరైజ్ చేయడంతో గతంలో వారికే పాస్ పుస్తకాలు జారీ చేస్తాం. కుంటలను సమీప రైతులు కబ్జా చేసినా, వాటి హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములను కాపాడుతాం. క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయకుండా అధికారులను అడ్డుకుంటే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

టిపిఆర్‌పిఎ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నారాయణరెడ్డి, కృష్ణమూర్తి
- మహాసభలో పలు తీర్మానాలు ఆమోదం
- పెన్షనర్ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఉద్యమాలకు శ్రీకారం



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టిపిఆర్‌పిఎ) రాష్ట్ర ఐదో మహాసభ హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 15, 16 తేదీల్లో జరిగాయి. ఈ మహాసభలకు 28 జిల్లాల నుంచి 500 మంది ప్రతినిధులుగా హాజరయ్యారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న అంశాలపై సభలో పలు తీర్మానాలను ఆమోదించారు. నూతన రాష్ట్ర కమిటీని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు పి నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి కృష్ణమూర్తి, కోశాధికారిగా కె నాగేశ్వర్‌రావుతోపాటు ఉపాధ్యక్షులుగా 8 మంది, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ మరో ఏడుగురు, అర్గనైజింగ్ కార్యదర్శులుగా 12 మంది, కార్యదర్శులుగా 19 మంది, అడిట్ కమిటీ సభ్యులుగా ఇద్దరు, 62 మందిని కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. రెండు రోజుల మహాసభలో ఐదు తీర్మానాలు ఆమోదించారు. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రికమండేషన్ ప్రకారంగా 65 ఏండ్లకు చేరిని వారికి ఐదు శాతం, 70 ఏండ్లకు చేరిన వారికి 10 శాతం,75 ఏండ్లకు చేరిన వారికి 15 శాతం ఎడిషనల్ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిజిహెచ్‌ఎస్ వసతి లేనివారికి ఎఫ్ఎంఎ రూ.మూడు వేలు చెల్లించాలని తీర్మానించారు. కోల్‌మైన్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.1500 నిర్ణయించాలనీ, మెడికల్ స్కీంలో వ్యత్యాసాలు తొలగించి, కార్మికులకు ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పిఎఫ్ఆర్‌డిఎ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తీర్మానించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తారీఖున పెన్షన్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల పెండింగ్‌లో ఉన్న మూడు డీఎలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల పట్ల పాలకులు అనుసరిస్తున్న విధానాల పట్ల మహాసభలో ఆమోదించిన తీర్మానాల ఆధారంగా రాబోయే కాలంలో సమస్యల పరిష్కారం కోసం పోరాడాల్సిన అవసరముందని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే నిజమైన మహిళా సాధికారత

- ముదిరాజ్ మహాసభ మహిళా విభాగం సమావేశంలో బండా ప్రకాష్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజికంగా అభివృద్ధి చెందినప్పుడే నిజమైన మహిళా సాధికారత, అందుకోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ ముదిరాజ్ మహాసభ మహిళా విభాగం రాష్ట్ర స్థాయి సన్నాహక సదస్సులో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ మహిళల సాధికారత కోసం పనిచేయాలని కోరారు. ముదిరాజులే మత్స్యకారులు.. మత్స్యకారులే ముదిరాజులు అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిలో మనం ఎట్లా అభివృద్ధి కావాలో ఆలోచించాలని సూచించారు. ముదిరాజ్ మహాసభలో మహిళా విభాగంతోపాటు యువజన విభాగం, డాక్టర్స్, లాయర్స్, ఐటి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, వివిధ రకాల విభాగాలతో సంఘాన్ని బలోపేతం చేయడానికి కషి చేయాలని కోరారు. మిగతా వృతుల వారితో కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు మందుల వరలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలపావని, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉష, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కె.రాధిక, ప్రధాన కార్యదర్శి మత్రికట్టెల శారద, రాష్ట్ర కార్యదర్శులు ఉష, అనురాధ, దీపిక, యాదాద్రి జిల్లా అధ్యక్షులు ఝాన్సీ, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బండిశ్రావణి, నల్గొండ జిల్లా అధ్యక్షులు కోట్ల సునీత తదితరులు పాల్గొన్నారు.